**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 85, పేజీలు - 08

బుధవారం, సెప్టెంబర్ 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## అట్టడుగు వర్గాల అభివృద్ధే

# ప్రభుత్వ లక్ష్యం!

### - ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు - ఇందిరమ్మ ఇళ్లలో 31% దళితులకు.. ఎస్టీలకు 17% ఇళ్లు
- అత్యాచార బాధితులకు గ్రీన్‌చానల్‌లో పరిహారం - చదువే జీవితాలను మారుస్తుందన్న సీఎం రేవంత్
- పిల్లలను విద్య, క్రీడల వైపు నడిపించాలన్న సీఎం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దళితులు, ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నామని వెల్లడించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

2లో..



## వందేమాతరం ఎన్ని చరణాలు పాడాలన్నది

# పౌరుల వ్యక్తిగతం

### - సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జాతీయ గేయం వందేమాతరం ఆలాపనపై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఎన్ని చరణాలు పాడాలనేది పౌరుల వ్యక్తిగతమని ఉద్ఘాటించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 ప్రకారం నిజమైన మతపరమైన అభ్యంతరాలు ఉన్న ఎవరిపైనా అందులోని వివాదాస్పద చరణాలు పాడలేదనే కారణంతో క్రిమినల్ చర్యలు తీసుకోలేరని తేల్చిచెప్పింది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను తప్పనిసరిగా ఆలపించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అలాగే జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం కింద వందేమాతరాన్ని జాతీయ గీతంతో సమానంగా సవరణ చేస్తూ వెలువరించిన

2లో..

## తెలంగాణలో ప్రమాదంలో

# 43లక్షల ఓట్లు

### - నోటీసులకు నో 'సర్' అంటే మీ ఓటు గల్లంతే!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతున్న విషయం తెలిసిందే. దేశ వ్యాప్తంగా సర్ ప్రక్రియ కొనసాగుతున్న వేళ తెలంగాణాలో సర్ లో భాగంగా ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులకు ప్రజల నుండి స్పందన కరువైంది. సర్ కు ఎస్ సర్ అనాల్సిన ఓటర్లు నో సర్ అంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో స్పందించని 43 లక్షల మందికి పైగా ఓటర్లకు తుది జాబితాలో చోటు దక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని తెలుస్తుంది. వీరి ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం పొంచి ఉంది.. గడువులోగా హాజరు కాని వారు రీషెడ్యూల్ ద్వారా దరఖాస్తు చేసుకుని విచారణకు రావాల్సి ఉంటుంది. లేకుంటే ఆ ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉంది.రాష్ట్రవ్యాప్తంగా 92.88 లక్షల మందికి నోటీసులు

2లో..

## విదేశీ ఉద్యోగాల మోసాలపై రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక

- అధిక జీతాల ఆశ చూపి సైబర్ నేరగాళ్లుగా మారుస్తున్నారని వెల్లడి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) విదేశీ ఉద్యోగాల పేరిట సాగుతున్న మానవ అక్రమ రవాణా, మోసాలు ఆందోళనకరంగా పెరిగిపోతుండటంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను

2లో..

# మున్సిపల్ చరిత్రలో సువర్ణాధ్యాయం

### - రూ.11,359 కోట్ల భారీ అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

- హెచ్ఏఎం పద్ధతిలో తొలిసారిగా 123 మున్సిపాలిటీల్లో పనుల ప్రారంభం - కుప్పం నుంచి లాంఛనంగా పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కుల నిర్మాణం లక్ష్యం

**అమరావతి (ప్రశ్న న్యూస్)** కుప్పం వేదికగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మున్సిపల్ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయంగా అభివర్ణించిన ఆయన, పట్టణాల అభివృద్ధికి కృషి చేస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి, అధికారులను అభినందించారు. గత రెండేళ్లుగా ఎన్నో సంక్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటూనే ఈ రంగాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఒక్కరోజే రూ. 11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించామని, ప్రస్తుతం

2లో..



## కూటమి బలంగా నిలబడాలి

### - జనసేన గౌరవానికి భంగం వాటిల్లకూడదు

- పిఠాపురంలో రూ.1500 కోట్ల విలువైన పనులు
- బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు
- ఎవరికి గౌరవం తగ్గకూడదన్న డిప్యూటీ సీఎం



పిఠాపురం (ప్రశ్న న్యూస్) కూటమి ప్రభుత్వం బలంగా ఉండాలని కోరుకుంటున్నాను అంటున్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ . భవిష్యత్‌లోనూ కలిసి పని చేయాలని కానీ ఎవరి గౌరవం తగ్గకుండా, జనసేన గౌరవానికి భంగం వాటిల్లకుండా ఉండాలన్నారు. ముందు ప్రజల అవసరాలు తీరిన తర్వాత ఆకాంక్షలు నేరవేర్చుకుందామంటూ పవన్ కళ్యాణ్ పిఠాపురంలో నిర్వహించిన సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో జనసేన పార్టీ కమిటీ సరిగ్గా పనిచేయడం లేదని అధికారం


2లో..

## నిమ్స్ వైద్యుడి ఆస్తులు

# రూ. 80 కోట్లకుపైనే

### - ఏసీబీ దాడుల్లో సంచలన విషయాలు

- హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం
- బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు
- 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అవినీతి, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న ప్రభుత్వ అధికారుల భరతం ఏసీబీ అధికారులు పడుతున్నారు. ఈ క్రమంలోనే పెద్ద పెద్ద తిమింగలాలు ఏసీబీ వలకు చిక్కుతున్నాయి. తాజాగా నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్) డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు మంగళవారం రోజున డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ ఇళ్లు ఆఫీసుల్లో భారీ ఎత్తున సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆయన ఇల్లు, ఆఫీస్ సహా మరో

2లో..

## ఆదిలాబాద్ రిమ్స్‌లో

# ఘోర అగ్నిప్రమాదం

### - ఏసీ పేలి ఘటన, ప్రమాదం

- అగ్నిప్రమాదంలో ముగ్గురు పసికందుల మృతి
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి - విచారణ చెప్పట్టాలని ఆదేశాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( రిమ్స్) ఆస్పత్రిలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందగా 20మందికిపైగా నవజాత శిశువులు అస్వస్థతకు గురయ్యారు. రిమ్స్ ఆస్పత్రిలోని పిల్లల వార్డులో అర్ధరాత్రి దాటిన తర్వాత షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా దట్టమైన పొగ అలుముకుంది. ఆస్పత్రి సిబ్బంది, ప్రైవేట్ అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తమై శిశువులను అక్కడి నుంచి బయటకు తరలించారు. మరోవైపు శిశువుల తల్లిదండ్రులు కూడా వారిని ఎత్తుకుని బయటకు పరుగులు తీశారు. మరోవైపు కరెంట్ నిలిచిపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### ఉన్నతస్థాయి విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

2లో..

# దసరాకు కొత్త పింఛన్లు

### - ముహూర్తం ఫిక్స్ చేసిన ప్రభుత్వం!



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా మరో 2.25 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దసరా పండుగకు ముందే కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు అందేలా ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇప్పటికే 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

2లో..

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం

### - అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రరూపం దాల్చుతుంది. వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కాప్రా, దుండిగల్, బోయిన్‌పల్లి, గాంధీనగర్, రామ్‌నగర్, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, అంబర్‌పేట, బోరబండ, ఎస్ఆర్‌నగర్, కోఠి, లక్డీకాపూల్ ప్రాంతాల్లో భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి.

2లో..



# అట్టడుగు వర్గాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం!

ఈ అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

### ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు 31 శాతం

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దళితులకు 31 శాతం ఇళ్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు. ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తూ అట్టడుగు వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 27.5 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో 3 కోట్ల 48 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, తద్వారా దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని పేర్కొన్నారు.

### బాధితులకు గ్రీన్‌చానల్‌లో పరిహారం

అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని సీఎం తెలిపారు. బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్‌చానల్ ద్వారా విడుదల చేయాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. చదువు ఒక్కటే జీవితాలను మార్చగలదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలను విద్య వైపు నడిపించకపోతే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని అన్నారు. పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు.

### ఇందిరమ్మ స్ఫూర్తితోనే..

సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను ఇప్పటికీ ప్రజలు మరిచిపోలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదేనని కొనియాడారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. "ఈ ప్రభుత్వం మీది.. మీ కోసం పనిచేస్తుంది" అని స్పష్టం చేశారు. ఈ వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## వందేమాతరం ఎన్ని చరణాలు

# పాడాలన్నది పౌరుల వ్యక్తిగతం

ఉత్తర్వులను ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.కృష్ణ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎస్. మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. ఆరు చరణాలలో నాలుగు చరణాలు స్పష్టంగా హిందూ దేవతలపై భక్తిని ప్రకటిస్తాయని, వాటిని పాడాలని నిర్బంధించడం రాజ్యాంగ లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ సవరణ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉందని, 'మెజారిటీ మతపరమైన సందేశాన్ని' ప్రోత్సహిస్తోందని వాదించారు. 'వారు 'జాతీయ గేయం' అనే పదాన్ని ప్రవేశపెట్టారు కానీ, అసలు నేషనల్ సాంగ్ అంటే ఏమిటో చట్టంలో నిర్వచించలేదు. గెజెట్‌లో కూడా ప్రచురించలేదు.. వారు ఏ చట్టపరమైన నిబంధననూ ఉదహరించడం లేదు" అని మురళీధర్ కోర్టుకు విన్నవించారు. అస్పష్టత ఆధారంగా శిక్షార్హమైన చర్యలు ఉండకూడదని, ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా ప్రభుత్వం చాలా తొందరపాటుతో వ్యవహరించిందని ఆయన నొక్కిచెప్పారు. సాధారణంగా పాడే రెండు చరణాలకే ఇది పరిమితం కాదని ప్రభుత్వం తప్పనిసరి చేయడాన్ని ఎత్తిచూపుతూ, 'మీరు బలవంతం చేస్తూ శిక్షార్హమైన చర్యలు తీసుకోలేరు' అని అన్నారు.ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ 'జాతీయ గీతం అంటే ఎల్లప్పుడూ వందేమాతరంగానే భావించారని, జాతీయ ఆకాంక్షలను కోర్టులు ప్రశ్నించలేవు' అని వ్యాఖ్యానించారు. 'ఇది రాజ్యానికి (ప్రభుత్వానికి) సంబంధించిన అంశం. ఒక వ్యక్తి ఒకటి లేదా నాలుగు చరణాలు పాడాలా అనేది ఆ వ్యక్తే నిర్ణయించుకోవచ్చు. దీనిపై శిక్షార్హమైన చర్యలు ఉండవు' అని న్యాయమూర్తి చెప్పారు. చారిత్రాత్మక 'బిజోయ్ ఇమ్మాన్యుయేల్' కేసులో తీర్పును ప్రస్తావిస్తూ జస్టిస్ బాగ్చీ దేశ చట్టమే సర్వోన్నతమైందని, ఆర్టికల్ 25, 26 హక్కులకు భంగం కలుగుతోందని భావించే ఎవరూ కూడా క్రిమినల్ చర్యలకు గురికాకూడదు' అని పేర్కొన్నారు.లౌకికవాదం వాదనలపై స్పందిస్తూ అమెరికా జాతీయ గీతంలో 'గాడ్' (దేవుడు) అనే పదం ఉందని, మతపరమైన ధ్వని ఉన్నంత మాత్రాన రాజ్యాంగ లౌకిక స్వభావం దెబ్బతింటుందా? అని జస్టిస్ బాగ్చీ ప్రశ్నించారు. చరిత్ర చదివిన ఎవరికైనా జాతీయ గీతం ఏమిటో తెలుస్తుందని సీజేఐ వ్యాఖ్యానించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రభుత్వం తరఫున వాదిస్తూ 'రాజ్యాంగవాదం అంత సంకుచితంగా ఉండకూడదు' అని వ్యాఖ్యానిస్తూ శాసన ప్రక్రియను సమర్థించారు. అయితే, 'చట్టాల తయారీ నక్సలైట్ల ప్రకారం జరగకూడదు' అని మెహతా వ్యాఖ్యానించడంతో విచారణ తీవ్రరూపం దాల్చింది. దీనిపై పిటిషనర్ తరఫున లాయర్ మురళీధర్ తీవ్ర అభ్యంతరం తెలుపుతూ వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కానీ, తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేయడం లేదని సొలిసిటర్ జనరల్ పునరుద్ఘాటించడంతో మురళీధర్ తీవ్ర నిరసన తెలిపారు. శాసన సంబంధ నిర్ణయాలు రాజ్యాంగబద్ధంగా ఉండాలని, ఆయుధాలు లేదా రాజ్యాంగేతర మార్గాల ద్వారా ప్రభావితం కాకూడదన్నదే తన ఉద్దేశమని మెహతా స్పష్టత ఇచ్చారు. ఆ వ్యాఖ్యను కోర్టు రికార్డుల్లోకి తీసుకోలేదని జస్టిస్ బాగ్చీ పేర్కొంటూ ఉగ్రవాదులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని కూడా చట్టబద్ధ పాలన (రూల్ ఆఫ్ లా) కిందే విచారిస్తారు కాబట్టే రాజ్యాంగ కోర్టులకు విశ్వసనీయత ఉందని నొక్కి చెప్పారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ స్పందనను కోరుతూ వందేమాతరాన్ని జాతీయ గీతంగా ప్రకటించడాన్ని న్యాయపరంగా ప్రశ్నించలేమని స్పష్టం చేస్తూనే, క్రిమినల్/ శిక్షార్హమైన చర్యలకు సంబంధించిన అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## తెలంగాణలో ప్రమాదంలో

# 43లక్షల ఓటు

రూపొందించగా, 82 లక్షల మందికి అందాయి. వీరిలో 43.98 లక్షల మంది 53 శాతం అంటే సగానికి పైగా ఓటర్లు గడువులోగా గుర్తింపు పత్రాలతో హాజరు కాలేదు.38 లక్షల మంది విచారణకు వచ్చి, వారిలో 27.44 లక్షల మంది పత్రాలు చూపి ఓటు నిలబెట్టుకోగలిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కూడా 66 వేల మందికి నోటీసులివ్వగా, 96 శాతం మంది స్పందించలేదు. దీంతో సీఎం నియోజకవర్గంలో మరోమారు రీ షెడ్యూల్ ద్వారా విచారణకు హాజరు కావాలి. లేదంటే ఆ ఓట్లు పోయే ప్రమాదం లేకపోలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 19.47 లక్షల మంది ఓటర్లు విచారణకు హాజరు కాలేదు. కుత్బుల్లాపూర్‌లో 2.48 లక్షలు, శేరిలింగంపల్లిలో 2.10 లక్షలు మంది విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఈ నియోజకవర్గాల్లో నోటీసులు అందుకున్న వారు నియోజకవర్గాల్లో ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.ఓటర్ల అనాసక్తికి కారణాలు ఎన్నో. తల్లిదండ్రుల గుర్తింపు కార్డులు కూడా తీసుకురావాలని చెప్పడం, బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లకుండా ఫోన్ చేయడం, వలస వెళ్లిన వారు అందుబాటులో లేకపోవడం వంటివి ప్రధానమైనవి.కొన్ని చోట్ల రెండు మూడు గుర్తింపు పత్రాలు అడుగుతున్నారు. ఇంకా ప్రత్యేక సమగ్ర సవరణ క్రింద 10 లక్షల మందికి నోటీసులు అందించాల్సి ఉంది. రీషెడ్యూల్ అవకాశం ఉన్నందున ఓటర్లు వెంటనే స్పందించి తమ ఓటును రక్షించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పుడు స్పందించక పోతే ఓటు పోయాక ఏం చేసినా ఫలితం ఉండదని అంటున్నారు.

## విదేశీ ఉద్యోగాల మోసాలపై

# రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరిక

అప్రమత్తం చేస్తూ కీలక మార్గదర్శకాలతో కూడిన అడ్వైజరీని జారీ చేసింది. నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అధిక వేతనాలు ఆశచూపి అమాయకులను ప్రలోభపెడుతున్న మోసగాళ్లు, వారిని అక్రమ మార్గాల్లో ("డాంకీ రూట్స్") విదేశాలకు తరలిస్తున్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. అక్కడ బాధితులను బంధించి, బలవంతంగా సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి నెడుతున్నారని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది.ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను కేంద్రం నిర్దేశించింది. సోషల్ మీడియా, జాబ్ పోర్టల్స్‌లో వస్తున్న అనుమానాస్పద ఉద్యోగ ప్రకటనలపై సైబర్ సెల్స్ ద్వారా నిఘా ఉంచాలని సూచించింది. బాధితుల నుంచి డిజిటల్ సంభాషణలు, నగదు చెల్లింపుల రికార్డులను కీలక ఆధారాలుగా వెంటనే సేకరించాలని ఆదేశించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్ అనుమతి లేకుండా నడుస్తున్న ఏజెన్సీలను తక్షణమే మూసివేయాలని స్పష్టం చేసింది. నకిలీ ఏజెంట్లపై మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం (యాంటీ ట్రాఫికింగ్) కింద కఠిన కేసులు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. అక్రమ వలసల ముప్పుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ 'ఇ-మైగ్రేట్' పోర్టల్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించింది. అనధికార ఏజెంట్లను గుర్తించే ప్రక్రియలో గ్రామ పంచాయతీలను సైతం భాగస్వాములను చేయాలని కేంద్రం పేర్కొంది.

# మున్సిపల్ చరిత్రలో సువర్ణాధ్యాయం

జరుగుతున్న పనులతో కలిపి మొత్తం రూ. 50 వేల కోట్ల విలువైన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఏపీ దశ-దిశ పూర్తిగా మారుతుందని పేర్కొన్నారు.

### వచ్చే 6 నెలల్లో మరో రూ.17 వేల కోట్ల పనులు

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ. 22,330 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని, రాబోయే ఆరు నెలల్లో మరో రూ. 17,000 కోట్ల పనులను కూడా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో రూ. 7,496 కోట్లతో, ఒక్క విశాఖ కార్పొరేషన్ పరిధిలోనే రూ. 3,890 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, సీవరేజ్ వ్యవస్థల మోడ్రనైజేషన్‌తో పాటు రిజర్వాయర్ల ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటితో పాటు 2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. విశాఖపట్నంలో ఇప్పటికే 28,500 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేశామని, ఎలాంటి అభ్యంతరాలు లేని ఇతర ప్రాంతాల్లో కూడా పేదలకు పట్టాలు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

### పట్టణ ప్రాంతాల్లో వీకెండ్ లో సగం ఆదాయం ఖర్చు

ఆర్థిక వ్యవస్థలో పట్టణ ప్రాంతాలు ప్రధాన గ్రోత్ ఇంజన్లుగా వ్యవహరిస్తాయని, వారాంతాల్లో ప్రజలు తమ ఆదాయంలో 61 శాతాన్ని ఖర్చు చేస్తున్నారని 'వీకెండ్ ఎకానమీ'ని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు తమ ఆదాయంలో 71 శాతం హౌసింగ్, రవాణాపైనే ఖర్చు చేస్తున్నారు. కనుక అందుకే టిడ్కో గృహాలతో పాటు రవాణా సౌకర్యం కోసం 'స్త్రీశక్తి' వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా 24 గంటలూ సురక్షితమైన తాగునీటిని అందిస్తామన్నారు.గత పాలనలో 120 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోవడమే కాకుండా జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర పథకాల నిధులను పక్కదారి పట్టించారని సీఎం చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం 143 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేసిందని, వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల ద్వారా వ్యర్థాల నిర్వహిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి 2047 నాటికి ప్రతి మున్సిపాలిటీని స్వర్ణ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దాలని కుప్పం వేదికగా ఆయన పిలుపునిచ్చారు.

# దసరాకు కొత్త పింఛన్లు

తాజాగా మరో 2.25 లక్షల మందికి కొత్త పెన్షన్లను ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు ప్రయోజనం కలగనుంది. కొత్త పెన్షన్ల మంజూరుకు ముందు దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన కీలకంగా మారింది. అర్హత ఉన్నవారిని గుర్తించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించి వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి అర్హులైన వారిని తుది జాబితాలో చేర్చనున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్ల కోసం ప్రత్యేక డిజిటల్ వ్యవస్థను నిర్వహిస్తోంది.అధికారిక చేయూత పోర్టల్‌లో పెన్షన్ ఐడీ, ఆధార్ వివరాలతో పింఛన్ సమాచారాన్ని తెలుసుకునే సదుపాయం కూడా కల్పించారు. కొత్త పెన్షన్లలో అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ వర్గాలకు చెందిన దరఖాస్తుదారుల్లో కొత్త పెన్షన్లపై ఆశలు పెరిగాయి. అయితే పెన్షన్ మంజూరు పూర్తిగా అర్హత, దరఖాస్తు పరిశీలన, అధికారిక ధ్రువీకరణపై ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అర్హత లేని దరఖాస్తులు, ఒకే వ్యక్తికి రెండుసార్లు ప్రయోజనం వంటి అంశాలను కూడా పరిశీలించిన తర్వాతే తుది లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయనున్నారు. ఈ ఏడాది దసరా అక్టోబర్ 20వ తేదీన రానుంది. ఈ నేపథ్యంలో పండుగకు ముందే కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది.మరోవైపు రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సామాజిక భద్రతా పింఛన్ల పరిధిని మరింత విస్తరించడంపైనా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ అందని వారికి కొత్తగా అవకాశం కల్పించడంలో భాగంగానే ఈ అదనపు పెన్షన్ల ప్రక్రియ చేపడుతోంది. కొత్త పెన్షన్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారు తమ వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం మంచిదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. తుది లబ్ధిదారుల ఎంపిక అధికారిక పరిశీలన అనంతరం జరుగుతుంది. దసరాకు ముందే కొత్త పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుండటంతో లబ్ధిదారులు అధికారిక ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారు.

# నిమ్స్ వైద్యుడి ఆస్తులు రూ. 80 కోట్లకుపైనే

ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో బయటపడిన స్థిర, చరాస్తుల బహిరంగ మార్కెట్ విలువ రూ.80 కోట్లకుపైనే ఉంటుందని తెలుస్తోంది.ఈ ఏసీబీ సోదాల్లో కూకట్‌పల్లి నుంచి విశాఖపట్నం వరకు పలు ప్రాంతాల్లో ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లు, బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, బంగారం, కార్లు, బైక్‌లకు సంబంధించిన వివరాలు బయటికి వచ్చాయి. ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాల ఆధారంగా వాటి విలువను లెక్కించే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రాథమికంగా గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ రూ.80 కోట్లకుపైగా ఉన్నట్లు సమాచారం. ఏసీబీ సోదాల్లో కూకట్‌పల్లిలోని హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీలో లగ్జరీ ఫ్లాట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. ఇందులో ఒక 4 బీహెచ్‌కే, రెండు 3 బీహెచ్‌కే ఫ్లాట్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు మణికొండ, పేట్‌బషీరాబాద్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇక యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట్ ప్రాంతాల్లో 4 ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలు లభించాయి. విశాఖపట్నంలో సుమారు 800 చదరపు గజాల స్థలం ఉన్నట్లు కూడా సోదాల్లో గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకున్నప్పుడు మొత్తం ఆస్తుల విలువ భారీగా ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.ఆస్తులతో పాటు లక్ష్మీభాస్కర్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపైనా ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. వివిధ బ్యాంకు అకౌంట్లలో సుమారు రూ.41 లక్షలు పోస్టాఫీస్ అకౌంట్లలో రూ.12 లక్షల డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో సుమారు రూ.35 లక్షల పెట్టుబడులు మ్యూచువల్ ఫండ్స్‌లో రూ.29.55 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సోదాల్లో 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు ఏసీబీ అధికారులు గుర్తించారు. దీంతో పాటు జాగ్వార్, ఆడీ వంటి లగ్జరీ కార్లతోపాటు.. టాటా నెక్సాన్ కారు కూడా ఉన్నట్లు తేలింది. ఇక రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా, యమహా వంటి 4 బైక్‌లకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇవి మాత్రమే కాకుండా సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను కూడా గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. మొత్తం ఆస్తులపై మరింత లోతుగా పరిశీలన కొనసాగుతోంది.ఏసీబీ సోదాల్లో మరో కీలక విషయం కూడా వెలుగులోకి వచ్చింది. వివాదంలో ఉన్న ఓ ఫ్లాట్ కొనుగోలు కోసం డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ సుమారు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. అదేవిధంగా తనకు తెలిసిన వారికి సుమారు రూ.1.33 కోట్లు అప్పుగా ఇచ్చినట్లు కూడా గుర్తించారు. ఈ లావాదేవీల వెనుక ఉన్న ఆర్థిక వనరులపై ఏసీబీ విచారణ కొనసాగిస్తోంది. డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ సుమారు 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్నారు. గత 5 ఏళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు నిర్వహించిన తర్వాత లక్ష్మీభాస్కర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడులు, స్థిరాస్తుల మార్కెట్ విలువపై అధికారులు మరింత పరిశీలన చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. డాక్టర్ లక్ష్మీభాస్కర్‌కు సంబంధించిన స్థిర, చరాస్తులలో ఇప్పటివరకు గుర్తించిన వివరాల ప్రకారం ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లు, విశాఖలో స్థలం, బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, బంగారం, వాహనాలు ఉన్నాయి. వీటి బహిరంగ మార్కెట్ విలువ రూ.80 కోట్లకుపైనే ఉన్నట్లు ఏసీబీ వర్గాల సమాచారం. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఆస్తులపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# తల్లి పేరుతో ఒక మొక్క నాటండి

**భద్రాద్రి కొత్తగూడెం,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి తల్లి పేరుతో ఒక మొక్క నాటండి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ? ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్క నాటడం ద్వారా, కోట్ల మొక్కలు నాటబడతాయని తద్వారా అవి పెరిగి పర్యావరణాన్ని కాపాడతాయని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డా. నాజ్నిన్ తబస్సు మ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ? వృక్షాలు మనకు ఆక్సిజన్ ను అందిస్తాయని, మన ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఇంచార్జి శంకర్ మహదేవన్, సునంద రెడ్డి, ఎకో క్లబ్ ఇంచార్జి మొత్కూరి పద్మ, ఉపధ్యాయులు శాంత, బాబురావు, వెంకటేశ్వర రావు,సుశీల,మోతిలాల్, జయరాం, పాఠశాల కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమి బలంగా నిలబడాలి

వచ్చాక నేతలు చల్లబడ్డారన్నారు. నేతలు చల్లబడకుండా ఉండాలంటే ఏం చేయాలో తనకు తెలుసని అధికారులు తన క్యాంప్ ఆఫీస్ పిఠాపురంలో పెట్టాలని అధికారులకు సూచిస్తున్నారని చెప్పుకొచ్చారు. జనసేన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసి పరిస్థితిని చక్కబెడతానని పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై సూచనలు చేస్తానన్నారు.గత రెండు సంవత్సరాల్లో పిఠాపురంలో జరిగిన అభివృద్ధిని అందరూ చూస్తున్నారన్నారు పవన్ కళ్యాణ్. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇప్పుడు మరో 1,500 కోట్లతో పలు కీలక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. పిఠాపురంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వైద్యం, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో మరింత అభివృద్ధి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పిఠాపురాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. పిఠాపురంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఆరోగ్య రంగంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.పిఠాపురంలో చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు రూ.34 కోట్లతో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని ఇప్పటికే 50% పనులు పూర్తయ్యాయన్నారు. యు. కొత్తపల్లి, చేబ్రోలు ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుర్వేద డిస్పెన్సరీ ఏర్పాటు చేశామన్నారు. రూ.7 కోట్లతో 26 కొత్త ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్నామని గత ప్రభుత్వంలో మధ్యలోనే ఆగిపోయిన 6 గ్రామ ఆరోగ్య కేంద్రాల పనులను పాడా నిధులతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిఠాపురం ప్రజలకు మెరుగైన వైద్యం వారి ప్రాంతంలోనే అందేలా ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామన్నారు.గత పర్యటనలో పిఠాపురం పట్టణంలో మురుగు, డ్రైనేజీ సమస్యలను స్వయంగా చూశానన్నారు పవన్ కళ్యాణ్. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఇప్పుడు పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నామన్నారు. రూ.225 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని రోజుకు 72 లక్షల లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో రెండు ఎస్టీపీలు నిర్మిస్తున్నామన్నారు. అలాగే రోజుకు 40 టన్నుల తడి చెత్తను శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఐదు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్ బ్లాక్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. మొగలి సూర్యుడి చెరువు అభివృద్ధి పనులు కూడా ప్రారంభించామని వెల్లడించారు.కాలుష్య నియంత్రణ కోసం బేలింగ్ మెషిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు డిప్యూటీ సీఎం. పిఠాపురాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సుందరమైన పట్టణంగా మార్చే దిశగా మరో ముందడుగు వేశామన్నారు. గతంలో పిఠాపురంలోకి అడుగుపెట్టగానే డంప్ యార్డ్, చెత్త కుప్పలే కనిపించేవని ఎంతో పవిత్రమైన పాదగయ క్షేత్రం పక్కనే చెత్త వేసే పరిస్థితి ఉండేదన్నారు. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చామని ఆ ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపించి, రూ.1.83 కోట్లతో అందమైన 'పీఠికాపుర వనం' నిర్మించామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే చెత్త ప్రదేశం స్థానంలో, ఇప్పుడు ఆహ్లాదకరమైన పచ్చదనం, అందమైన వాతావరణం ఏర్పడిందన్నారు.అంతేకాదు ఉప్పాడ తీర ప్రాంత ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కీలక అడుగు ముందుకు పడిందన్నారు పవన్. ఈ సమస్యకు పరిష్కారంగా సుమారు రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు సాధించామన్నారు. ఈ రక్షణ గోడకు సంబంధించిన డిజైన్లు, సర్వేలను ఐఐటీ మద్రాస్ పూర్తి చేసిందని ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఉప్పాడ సముద్ర కోతను అడ్డుకోవడం చాలా కష్టమైన పని అంటూ చాలామంది చెప్పారని కానీ ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతగా, అసాధ్యం అనుకున్న పనిని సుసాధ్యం చేసి చూపించానన్నారు పవన్ కళ్యాణ్.

# ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర అగ్నిప్రమాదం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### ప్రైవేట్ చిల్డ్రన్స్ ఆస్పత్రికి చిన్నారులు

మరోవైపు ఈ ప్రమాదం జరిగిన సమయంలో పిల్లల వార్డులో 27 మంది నవజాత శిశువులు ఉన్నట్టుగా అధికారులు తెలియజేశారు. వీరిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ముగ్గురు మరణించగా, మిగిలిన 24 మంది పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం వారిని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించినట్టుగా చెప్పారు. వీరిలో నలుగురికి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని వారి ఆరోగ్య పరిస్థితి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన శిశువును ఇచ్చోడకు చెందిన సలీం కుమార్తెగా గుర్తించారు. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇకపోతే ఈ విషయం తెలిసిన వెంటనే ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ఉన్నతాధికారులు రిమ్స్ ఆస్పత్రికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్ పేలిపోయి వెంటనే దట్టమైన పొగ పిల్లల వార్డును కమ్మేసినట్టుగా తెలుస్తోంది.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం

భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయుగుండం ఎఫెక్టుతో రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదారాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. హైదరాబాద్ లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

### రెండు రోజులు అత్యంత భారీ వర్షాలు

ఇవాళ 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 12 గంటల్లో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో పలు చోట్ల అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### అధికారులు అప్రమత్తంగా ఉండండి - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి అధికారులు అప్రమత్తం చేశారు. మున్సిపల్ కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు సమన్వయం చేసుకుని పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్లు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధం ఉండాలన్నారు. కంట్రోల్ రూమ్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు

## రక్తదాన సేవా కార్యక్రమాల్లో

# ముందంజలో అబ్దుల్ రహ్మాన్


**కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం** త్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి ఎం.డి. అబ్దుల్ రహ్మాన్ అలియాస్ జబ్బు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.ముఖ్యంగా అత్యవసర సమయాల్లో రక్తదాతలను సమన్వయం చేస్తూ అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా అహర్నిశలు కృషి చేస్తున్నారు.

రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు యువతలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, స్వచ్ఛంద రక్తదానానికి ప్రోత్సహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రక్తదాతలను ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషిస్తున్నారు.అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మొక్కలు నాటడం, వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు.అబ్దుల్ రహ్మాన్ సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్, గుంటూరులోని గ్రేస్ లైఫ్ ఫౌండేషన్, ఆత్మకూరులోని భారత్ రక్తదానం సేవ మిషన్ ఫౌండేషన్‌ల నుంచి మూడుసార్లు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు.ఈ సందర్భంగా యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు జేబీ బాలు, గౌరవ అధ్యక్షుడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంగం ఎక్కడ పుల్లయ్య, మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు, జేఏసీ చైర్మన్ వీరునాయక్, ప్రకృతి ప్రేమికుడు, ఏటీఈసీ జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, జిల్లా కార్యదర్శి రాజేష్, హనుమాన్ జిమ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ కమలాకర్‌తో పాటు స్థానికులు అబ్దుల్ రహ్మాన్‌ను అభినందించారు.రక్తదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు..

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇంటర్వ్యూ

## నైపుణ్యాలపై జిల్లా స్థాయి వెబినార్

## ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ), డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ (డీఆర్‌సీ), ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గజ్వేల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 'ఇంటర్వ్యూ నైపుణ్యాల అభివృద్ధి' అంశంపై జిల్లా స్థాయి వెబినార్ నిర్వహించారు.ఈ సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం మాట్లాడుతూ.. ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడంలో విద్యార్హతలతో పాటు సంభాషణా నైపుణ్యాలు, శరీర భాష, ఆత్మవిశ్వాసం, ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు చెప్పే విధానం, వృత్తిపరమైన ప్రవర్తన వంటి అంశాలు ఎంతో కీలకమని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య వక్తగా సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా. బి. సుచిత్ర సింగ్ పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూ నైపుణ్యాలపై విలువైన సూచనలు, ఆచరణాత్మక మార్గదర్శకాలను అందించారు. ఇంటర్వ్యూకు ముందస్తు సన్నద్ధత, ఉద్యోగం ఇచ్చే సంస్థ గురించి అవగాహన పెంచుకోవడం, సాధారణ ఇంటర్వ్యూ ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు ఇవ్వడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాలకు ప్రత్యక్షంగా హాజరై 140 మంది, ఆన్‌లైన్ ద్వారా 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కానింగ్ కేంద్రాల పనితీరుపై పర్యవేక్షించాలి

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

## - లింగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలు, ఆడ, మగ జనాభా నిష్పత్తిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా పరిధిలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు పై పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలు, ఆడ, మగ జనాభా నిష్పత్తిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీస్ శాఖ తదితరులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షించాలని, పీసీ పీ ఎన్ డీ టీ యాక్ట్ సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని తెలియజేశారు. భ్రూణ హత్యలతో మగ, ఆడ పిల్లల లింగ నిష్పత్తిపై ప్రభావం చూపుతుందని తెలిపారుఆడ అయినా మగ అయినా ఒకటేనని, ఇద్దరూ సమానమేనని స్పష్టం చేశారు. దీనిపై వైద్య ఆరోగ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా అవగాహన కల్పించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల పనితీరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, డిప్యూటీ డీ ఎం హెచ్ ఓ నాగేంద్రబాబు, ఎన్జీఓ బాధ్యుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

# బాలాపూర్ గణనాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## పెద్ద ఎత్తున స్వాగతం పలికిన స్థానికులు



శంషాబాద్ (ప్రశ్న న్యూస్ ,), సెప్టెంబర్ 22, పూరి జగన్నాథుని ఆలయ నమూనాలో బాలాపూర్ గణేష్ మండపంలో గణనాథున్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం బాలాపూర్ లో కొలువుదీరిన గణనాథుని మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన మండపం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది, ఒడిస్సా లోని ప్రసిద్ధ పూరి జగన్నాథ స్వామి దేవాలయం రీతిలో అత్యంత సుందరంగా భక్తి భావం ఉట్టిపడేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దడం జరిగిందని ఈ అద్భుతమైన ఆలయ నమూనాను దర్శించడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఇంతటి భారీ అందమైన మండపాన్ని ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యుల కృషిని, వారి ఆలోచన విధానాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి, మైలార్ దేవులపల్లి డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, శంషాబాద్ మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ సమితి సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మద్యానికి మంత్రి ఉన్నారు.. విద్యకు ఎందుకు లేరు

**1000 రోజుల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలేది?**
**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి**
**మెదక్ కేంద్రంగా ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి**
**పాలిటెక్నిక్‌ల విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి**
**విద్యారంగాన్ని విస్మరిస్తే ప్రభుత్వ పతనం తప్పదు**
**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి**



**కాకినాడ(ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సన్నద్ధం కావాలని పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయి నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం కాకినాడలో జనసేన నాయకులతో ఆయన సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల కోసం నియమించిన సమన్వయకర్తలు, కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, సపోర్ట్ టీం సభ్యులు పాల్గొన్నారు. ఆయా విభాగాల బాధ్యతలు, ఎన్నికల సన్నాహక కార్యాచరణపై నాయకులతో చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా నియమించిన కమిటీలు క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధివిధానాలను పవన్ కల్యాణ్ వివరించారు. స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల సన్నాహకాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల పరిధిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ఇప్పటికే ఏర్పాటు చేసిన కమిటీలు, సమన్వయకర్తలు తమ పరిధిలోని పరిస్థితులను అధ్యయనం చేసి తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలని సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, సమన్వయ కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసుకుని ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని స్పష్టం చేశారు. కాకినాడలో జరిగిన ఈ సమావేశంతో జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక ప్రక్రియకు మరింత ప్రాధాన్యం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# ప్రథమ పూజ్యునికి ప్రత్యేక పూజలు



సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్) వీనస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మండపంలో కొలువైన విఘ్నేశ్వరుడు ప్రత్యేక పూజలు అందుకుంటు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ప్రతి రోజు నిర్వహించే పూజలతో పాటు గణపతి హోమం, సహస్ర మోదక్ హోమం, గణపతి అష్టోత్తరం శతనామావళి, అన్న ప్రసాద వితరణ, పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శాంత్ కుమార్ తెలిపారు. అలాగే వీనస్ యూత్ అసోసియేషన్ యొక్క 50 ఏళ్ల ప్రస్థానంలో, దాదాపు 35-40 ఏళ్లపాటు అంకితభావంతో వైదిక సేవలు అందించిన కృష్ణ మోహన్ శర్మ (క్రిష్ణ పంతులు) ను వీనస్ యూత్ అసోసియేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా కృతజ్ఞతాపూర్వక సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించామని తెలుపుచు కృష్ణమోహన్ శర్మ అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుచేంద్ర, దాస్, చిద్విలాస్, అరుణ్, అభి తదితరులు పాల్గోన్నారని శాంత్ కుమార్ తెలిపారు.

# అర్చక పరీక్షలు త్వరితగతిన నిర్వహించాలి: గట్టు శ్రీనివాసాచార్యులు

- తెలంగాణ ఆలయాల్లో ఆగమ పండితుల నియామకం, అర్చకులకు ప్రమోషన్లు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని కమిషనర్‌కు వినతి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అర్చక ఆగమ పరీక్షలను త్వరితగతిన నిర్వహించాలని, రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ తరఫున ఆగమ పండితులను నియమించాలని కోరుతూ తెలంగాణ అర్చక సమాఖ్య, భాగ్యనగర అర్చక పురోహిత సంఘం ప్రతినిధులు దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు పదోన్నతులు కల్పించడంతో పాటు, వారికి అవసరమైన ఇతర సౌకర్యాలను అందించాలని ప్రతినిధులు కోరారు. అదేవిధంగా అర్చకులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా వర్తింపజేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అర్చక ఆగమ పరీక్షలు ఆలస్యం కాకుండా త్వరగా నిర్వహించడం ద్వారా అర్హులైన అర్చకులకు అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ప్రధాన ఆలయాల్లో ఆగమ శాస్త్ర పరిజ్ఞానం కలిగిన పండితుల నియామకం ద్వారా ఆలయాల్లో ఆగమ సంప్రదాయాలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. అర్చకుల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై కమిషనర్‌తో ప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీనివాసాచార్యులు, అర్చక సమాఖ్య కన్వీనర్ పరాశం రవీంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


# శ్రీశైల మహాక్షేత్రాన్ని దర్శించుకున్న ఎంపీలు, ఉత్తరాఖండ్ సీఎస్



శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )శ్రీశైలంమహాక్షేత్రం సోమవారం ప్రముఖుల రాకతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు,ఉన్నతాధికారులు భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం ఉదయం మహారాష్ట్రలోని బారామతి ఎంపీ సుప్రియా సూలే కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా కర్ణాటకలోని హావేరి ఎంపీ ఉడాసి శివకుమార్ చన్న బసప్ప, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆనంద్ బర్ధన్ ఐఏఎస్ కూడా శ్రీశైల ఆలయాన్ని సందర్శించి సందర్శించారు. వారందరికీ ఆలయ కార్యనిర్వ హణాధికారి ఎం. శ్రీనివాసరావు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించి, ఆలయ మర్యాదలతో స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డిని కలిసిన మాజీ కమిషన్ సభ్యులు చిలకమర్రి నరసింహ

శంషాబాద్ (ప్రశ్న న్యూస్ ) సెప్టెంబర్ 22, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు సోమవారం ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.



# ఎంజిఎం ఆసుపత్రి దగ్గర ఉద్రిక్తత

- మాజీ ఎమ్మెల్యే దాస్యం కు గాయాలు

**వరంగల్** మంగళవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆసుపత్రిలో మరోసారి సీలింగ్ పెచ్చులు ఊడిపోయాయని వార్తలు రావడంతో గాయాలైన రోగుల పరిస్థితి తెలుసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అక్కడికి చేరుకున్నారు. అయనను పోలీసులు అడ్డుకున్నారు. ఘటనలో పోలీసులు తనను కడుపులో తన్నినట్లు అయన ఆరోపించారు. తన చేయి విరిగిందంటూ కంటతడి పెట్టుకున్నారు. ఆసుపత్రిలోని మీడియాను కుడా పోలీసులు అడ్డుకున్నారు. ఆసుపత్రి గేటు ముందు భారీగా మోహరించారు. వినయ్ భాస్కర్ ను స్థాని అజాత ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్పై పోలీసుల దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. పోలీసుల అత్యుత్సాహంతో వినయ్ భాస్కర్కు గాయాలు అయ్యాయి. బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేసారు.

# అరకొరగా పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్

- పోతల ప్రభాకర్. - 11వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలి.
- పాత నోటిఫికేషన్ రద్దు చేయాలి.
- వయోపరిమితిని 5సంవత్సరాలు పెంచాలి - ఏఐవైఎఫ్ డిమాండ్.

**కనిగిరి:** పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం విడుదల చేసిన అరకొర నోటిఫికేషన్ తక్షణమే రద్దుచేసి, ఖాళీగా ఉన్న 11 వేల ఉద్యోగాల భర్తీకి సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య( ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పోతల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మార్కాపురంలోని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఎంతో కాలంగా పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 2 వేల 50 కానిస్టేబుల్, ఎస్సై పోస్టులతో విడుదల చేసిన నోటిఫికేషన్ ఆ శాఖలోని ఖాళీల అభ్యర్థుల సంఖ్యలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉందని విమర్శించారు. సంవత్సరాల తరబడి పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఈ నిర్ణయం తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏళ్ల తరబడి నియామకాలు చేపట్టకపోవడం వల్ల వేలాది నిరుద్యోగ అభ్యర్థులు వయో పరిమితిని దాటిపోయి అర్హత కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీస్ ఉద్యోగాలకు ఐదు సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేయడంవల్ల యువతకు ఉద్యోగ కల్పన లభిస్తుందని సూచించారు. నిరుద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను సమీకరించి ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పూర్ణచంద్ర రాజు, పెద్దన్న, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మొల్లేరు అంగన్ వాడీలో పోషకాహారంపై అవగాహన

**గంగవరం** పోలవరం జిల్లా గంగవరం మండలం మొల్లేరు గ్రామంలోని అంగన్ వాడీ 1వ సెంటర్ లో బుధవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, ప్రీ-స్కూల్ పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి వారికి వివరించారు. పిల్లల ఎదుగుదలకు, తల్లుల ఆరోగ్యానికి సరైన పోషకాహారం ఎంత అవసరమో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలవరం జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ ఎం. సూర్యచంద్ర, పోలవరం జిల్లా మహిళా మోర్చా సెక్రెటరీ ఎం. వెంకటరత్నం, ఐసీడీఎస్ మేడం, అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులు వెళ్లే దారి ఆక్రమించి కంచె ఏర్పాటు


**చిట్వేలి** ఎన్నో సంవత్సరాలుగా రైతులు, గ్రామస్తులు వినియోగిస్తున్న పొలాల లోనికి వెళ్లడానికి ఉన్న రహదారికి అడ్డంగా కంచె వెలిసింది. దారి ఆక్రమణకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఆరోపిస్తూ మైలపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామస్తులు చిట్వేలి మండలం రెవెన్యూ అధికారి నరసింహారావు కు సమర్పించారు. గ్రామకంఠం నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిని కొందరు ఆక్రమించి కంచె నిర్మించారని, దీంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గ్రామకంఠం నుంచి పొలాల్లోకి వెళ్లే ఈ దారిని స్థానికులు ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో పొలాలకు వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుతం కంచె ఏర్పాటు చేయడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందన్నారు. దారి మూసివేయడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి దారికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, హద్దులు, గ్రామ మ్యాప్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. దారి ఆక్రమణకు గురైనట్లు రికార్డుల ద్వారా నిర్ధారణ అయితే ఆక్రమణను వెంటనే తొలగించి, గ్రామస్తుల రాకపోకలకు మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చిట్వేలి ఎంఆర్ఓ నరసింహారావును కలిసి తమ సమస్యను వివరించారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, దారి విషయంలో స్పష్టత తీసుకురావడంతో పాటు ఆక్రమణలు ఉంటే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల రాకపోకలకు ఆటంకం కలగకుండా అధికారులు తక్షణమే స్పందించాలని గొల్లపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# బఫర్ జోన్‌లో బహుళ అంతస్తుల నిర్మాణాలు

## - అధికారుల మౌనం ఎందుకు.?

- మల్లంపేట--కత్వకుంట చెరువుల పరిధిలో నిర్మాణాలపై స్థానికుల తీవ్ర ఆగ్రహం
- ఇరిగేషన్ అధికారులు బఫర్ జోన్‌గా గుర్తించినా, చర్యలు ఎక్కడ.?
- అనుమతులు ఎవరిచ్చారు..? నిర్మాణ పనులను ఎందుకు అడ్డుకోలేదు.?
- ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు బిల్డర్ తో కుమ్మకయ్యారా.?
- బఫర్ జోన్ లో నిర్మాణం అని తెలిసి కూడా ఎందుకు కూల్చడం లేదు





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా దుండిగల్--గండి మైసమ్మ మండలం బౌరంపేట పరిధిలోని శ్రీ అవనిస్ శుకృతి హోమ్స్ ప్రాంతంలో చెరువు బఫర్ జోన్‌కు సంబంధించిన వివాదం స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. మల్లంపేట చెరువు, కత్వకుంట చెరువు బఫర్ జోన్ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగించారని, కొన్ని నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు నేపథ్యంలో ఇరిగేషన్ శాఖకు చెందిన ఏఈ స్థాయి అధికారి స్థల పరిశీలన చేపట్టినట్లు, పరిశీలనలో నిర్మాణ ప్రాంతం చెరువు బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ అంశంపై స్పష్టమైన అధికారిక నివేదికను ప్రజలకు వెల్లడించకపోవడం, నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడంపై ఇరిగేషన్, రెవిన్యూ అధికారుల వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### నిర్ధారణ జరిగితే.. చర్యలు ఎందుకు లేవు.?

నిర్మాణ ప్రాంతం బఫర్ జోన్‌లోకి వస్తుందని పరిశీలనలో గుర్తించినట్లయితే, నిర్మాణాలు పూర్తయ్యే వరకు అవి ఎలా కొనసాగాయన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చిన సమయంలోనే ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు ఎందుకు స్పందించలేదని స్థానికులు నిలదీస్తున్నారు. బిల్డర్ తో కుమ్మక్కై మౌనంగా ఉన్నారా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### అనుమతులు ఎవరి ఆధారంగా.?

బఫర్ జోన్ లో ఉన్న ప్రాంతంలో నిర్మాణ అనుమతులు ఏ రికార్డుల ఆధారంగా మంజూరు చేశారు.? ఇరిగేషన్ శాఖ నుంచి ఎలాంటి నివేదికలు, ఎన్‌ఓసీలు తీసుకున్నారు.? రెవెన్యూ రికార్డులు, ఎఫ్‌టీఎల్ సరిహద్దులను పరిశీలించారా.? బఫర్ జోన్ అని అధికారులు తెలుపుతున్న ఇప్పటివరకు రెవిన్యూ అధికారులు ఎందుకు పూర్తిస్థాయిలో కూల్చివేతలు చేయలేదు. అంటే స్థానిక రెవిన్యూ అధికారుల కనుసైగల్లోనే బఫర్ జోన్ కబ్జా కు గురవుతుందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఒకవేళ నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు తేల్చితే అనుమతులు మంజూరు చేసిన అధికారులు, పరిశీలనలు నిర్వహించిన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.చెరువు ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌కు సంబంధించిన వివాదం ఉన్న ప్రాంతాల్లో ఇళ్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు భవిష్యత్తులో న్యాయపరమైన, పరిపాలనా సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ముడుపుల ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలి

కొంతమంది స్థానికులు అధికారులపై నిర్లక్ష్యంతో పాటు అక్రమ ప్రయోజనాలు, ముడుపుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఏసీబీ, స్టేట్ విజిలెన్స్ అధికారులచే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

### రీ సర్వేకు డిమాండ్

మల్లంపేట--కత్వకుంట చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సరిహద్దులను రీ సర్వే చేసి వివరాలను బహిరంగంగా ప్రకటించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణాలకు మంజూరైన అనుమతులు, ఇరిగేషన్ శాఖ పరిశీలన నివేదికలు, రెవెన్యూ రికార్డులు, ఎన్‌ఓసీలు, నిర్మాణ అనుమతుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.చెరువులను పరిరక్షించాల్సిన అధికారుల కళ్లముందే బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరిగాయనే ఆరోపణలు వస్తుంటే ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు మౌనంగా ఉండడం పై స్థానిక ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

- శంషాబాద్ మినీ స్టేడియం లో యునాని ఆధ్వర్యంలో ర్యాలీ అవగాహన కార్యక్రమం
- నేడు శంషాబాద్ యునాని ఆసుపత్రిలో ఉచిత మెడికల్ క్యాంప్
- యునాని వైద్యురాలు డాక్టర్ మిద్దె జయశ్రీ





**శంషాబాద్ (ప్రశ్న న్యూస్ ), సెప్టెంబర్ 22,** ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని శంషాబాద్ యునాని వైద్యురాలు డాక్టర్ మిద్దె జయశ్రీ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో మంగళవారం 11 ఆయుర్వేద దినోత్సవ సందర్భంగా రెండవ రోజు స్థానిక మినీ స్టేడియంలో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద యునాని వైద్యుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, స్టేడియంలో యోగా పై అవగాహనతో పాటు ఆసనాలు నిర్వహించారు.ఈ సందర్భంగా యునాని వైద్యురాలు మిద్దె జయశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధులు ముదిరిన తర్వాత ఆసుపత్రులకు వస్తున్నారని దీంతో మందుల వల్ల కోల్పోవడం కొంచెం ఆలస్యమలవుతుందని అందుకని ముందుగానే ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు దీని ద్వారా ఎలాంటి శారీరక రుగ్మతలు ఉన్న బయటపడతాయని దీనివల్ల ట్రీట్మెంట్ కూడా సులభతరం అవుతుందని తెలిపారు. వైద్యులు చేపడుతున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి శారీర రుగ్మతలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించుకొని జీవిత కాలాన్ని పొడిగించుకోవాలన్నారు. మన దినచర్యలో భాగంగా యోగా మెడిటేషన్ ఎంతో ఉపయోగకరమని మానసిక ప్రశాంతత శారీరక దృఢత్వం యోగ వల్ల ప్రయోజనం ఉందన్నారు. యునాని వైద్యానికి ఎంతో ఆదరణ పెరుగుతుందని ప్రజలు కూడా వైద్యం పట్ల ఆసక్తిని చూపిస్తున్నారని వార అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ఆసుపత్రి వైద్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నేడు శంషాబాద్ డిస్పెన్సరీ వైద్యశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు యునాని వైద్యశాల లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కుప్పానికి హంద్రీనీవా జలహారతి

- కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు
- బీరగానిపల్లె రిజర్వాయర్‌కు శంకుస్థాపన..
- 550కిపైగా చెరువులకు నీరందించే ప్రణాళిక



కుప్పం(ప్రశ్న న్యూస్) కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా జలాలు చేరడంతో జలహారతి కార్యక్రమం ఘనంగా జరిగింది. శాంతిపురం మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు హారతి ఇచ్చారు. పసుపు, కుంకుమలు సమర్పించి పుష్పాలతో నీరాజనం పలికారు.కుప్పం బ్రాంచ్ కెనాల్ ఇరువైపులా భారీగా తరలివచ్చిన రైతులు, మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'హంద్రీనీవా జలం కుప్పానికి వరం' అంటూ నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

**నీటి భద్రతే కీలకం**(కుప్పం అభివృద్ధికి నీటి భద్రత అత్యంత కీలకమని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న పాదాల చెంత నుంచి హంద్రీనీవా పథకం ద్వారా కుప్పానికి నీటిని తీసుకొచ్చామని చెప్పారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 133 చిన్న నీటి చెరువులను నింపి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.గత ఏడాది 2.4 టీఎంసీల నీటిని విడుదల చేయగా.. భూగర్భ జలాలు మూడు మీటర్ల మేర పెరిగాయని సీఎం తెలిపారు. దీంతో ఎండిపోయిన బోర్లు మళ్లీ జీవం పోసుకున్నాయని పేర్కొన్నారు.

బీరగానిపల్లె రిజర్వాయర్‌కు శ్రీకారంఅంతకుముందు బీరగానిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రిజర్వాయర్ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.చిత్తూరు జిల్లాలో యామిగానిపల్లి, మదనపల్లి ప్రాంతాల్లోనూ రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కుప్పం నియోజకవర్గంలో 550కిపైగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను లిఫ్ట్ ఇరిగేషన్, పైపులైన్లు, గ్రావిటీ కాలువలతో అనుసంధానం చేస్తామని సీఎం తెలిపారు.కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# చక్రస్నానానికి పటిష్ట భద్రత

- భక్తుల భద్రత.. సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యం
- పుష్కరిణి వద్ద ఏర్పాట్ల పరిశీలన.. సమన్వయంతో విధులు
- నిర్వహించాలని అదనపు ఈవో ఆదేశం





**తిరుమల(ప్రశ్న న్యూస్)** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల ముగింపు ఘట్టమైన చక్రస్నానానికి టీటీడీ పటిష్ట ఏర్పాట్లు చేసింది. సెప్టెంబరు 23న శ్రీవారి పుష్కరిణిలో జరగనున్న పవిత్ర కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, రద్దీ నియంత్రణ, ప్రవేశ--నిష్క్రమణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంగళవారం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి పుష్కరిణి పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

**క్రమపద్ధతిలో ప్రవేశం** భక్తులు పుష్కరిణిలోకి సులభంగా ప్రవేశించి, తిరిగి బయటకు వెళ్లేలా నిర్దేశిత ప్రాంతాల్లో గేట్లు ఏర్పాటు చేశారు. టీటీడీ అధికారులు, విజిలెన్స్, పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని అదనపు ఈవో ఆదేశించారు. పుష్కరిణి చుట్టూ ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోని భక్తులను దశలవారీగా పుష్కరిణిలోకి అనుమతించాలని సూచించారు.

**ఉదయం 6 నుంచి 9 గంటల వరకు** సెప్టెంబరు 23న ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు, చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ పవిత్ర ఘట్టాన్ని భక్తులు క్రమపద్ధతిలో వీక్షించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

ఎల్ఈడీ తెరలపై వీక్షణపుష్కరిణి వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున చక్రస్నాన మహోత్సవాన్ని అందరూ సులభంగా వీక్షించేలా ఆలయ పరిసరాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

**అధికారులతో సమీక్ష** అంతకుముందు వైభవోత్సవ మండపంలో చక్రస్నానం ఏర్పాట్లపై టీటీడీలోని వివిధ విభాగాల అధికారులతో అదనపు ఈవో సమీక్ష నిర్వహించారు. భక్తుల సౌకర్యం, భద్రత, రద్దీ నియంత్రణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమీక్షలో టీటీడీ జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీఈ మనోహర్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కల్కి అలంకారంలో కలియుగ దైవం

- అశ్వ వాహనంపై శ్రీమలయప్ప దివ్యదర్శనం
- గోవిందనామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు మంగళవారం రాత్రి అశ్వ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. స్వామివారి వాహనసేవను తిలకించేందుకు విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో తిరుమాడ వీధులు కిక్కిరిశాయి.అశ్వ వాహనానికి ముందు గజరాజులు నడుస్తుండగా.. భక్త బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ 'గోవిందా.. గోవిందా' అంటూ నామస్మరణ చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో వాహనసేవను తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

**ఇంద్రియ నియంత్రణకు అశ్వ వాహనం** అశ్వ వాహనసేవలో అంతర్లీనంగా ఆధ్యాత్మిక సందేశం దాగి ఉంది. ఉపనిషత్తులు ఇంద్రియాలను గుర్రాలతో పోలుస్తాయి. అశ్వాన్ని అధిరోహించిన పరమాత్మ ఇంద్రియాలకు నియామకుడిగా, వాటిని నియంత్రించే శక్తిగా ఈ వాహనసేవ ద్వారా తెలియజేస్తున్నారు. కృష్ణయజుర్వేదం కూడా పరమాత్మను అశ్వ స్వరూపంగా తెలియజేస్తుంది. కల్కి స్వరూపంలో అశ్వ వాహనంపై విహరించిన శ్రీమలయప్పస్వామివారు.. కలియుగ దోషాలకు దూరంగా ఉంటూ, నామసంకీర్తనను ఆశ్రయించి భగవంతుని అనుగ్రహాన్ని పొందాలనే సందేశాన్ని భక్తులకు అందిస్తున్నట్లు వాహనసేవ అంతరార్థం తెలియజేస్తోంది.

**భక్తి పారవశ్యం** అశ్వ వాహనం తిరుమాడ వీధుల్లో ముందుకు సాగుతున్న కొద్దీ భక్తుల ఉత్సాహం మరింత పెరిగింది. భజన బృందాల కీర్తనలు, కోలాటాల సందడి, మంగళవాయిద్యాల నాదం, గోవిందనామస్మరణతో తిరుమల కొండ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణపతి పూజలు



సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్) సుల్తాన్ బజార్ పరిధిలోని బడిచౌడి కూరగాయల మార్కెట్లో యూత్ ఫ్రెండ్స్ గణేష్ పూజా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఘనంగా వినాయక నవరాత్రుల పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తూ మహా ప్రసాద నివేదన, మహహారతి అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందిస్తున్నామన నిర్వాహకులు తెలిపారు. బుధవారం నాడు వినాయక మండపం వద్ద డి. అంజనేయులు, స్వామి, ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గోని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. కె. సుభాష్, శాంత్ కుమార్, మురళి (లడ్డు) మనీష్ కపూర్, వినోద్ కపూర్, శుభంకపూర్, లక్కీ, సురేష్, కిషన్ రావు, అంజనేయులు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గోన్నారు.

# ఉచిత ప్రయాణం.. ఎదురుచూపుల ప్రయాస

**- ఇబ్రహీంపట్నంలో బస్టాప్‌ల వద్ద మహిళల పడిగాపులు - రద్దీతో ఆగకుండానే వెళ్లిపోతున్న బస్సులంటూ ప్రయాణికుల ఫిర్యాదులు**

**- ఆధార్/కార్డు పనిచేయదంటూ టికెట్లు అడుగుతున్నారంటూ ఆరోపణలు - బస్సుల సంఖ్య పెంచి సమస్య పరిష్కరించాలని మహిళల విజ్ఞప్తి**




ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సుల్లో రద్దీ అధికమైందని, ఫలితంగా బస్టాప్‌ల వద్ద మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బస్సులు రద్దీ కారణంగా బస్టాప్ వద్ద ఆగకుండా వెళ్లిపోతున్నాయని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

## బస్టాప్‌లోనే గంటల నిరీక్షణ

ఇబ్రహీంపట్నం పరిసర గ్రామాలు, శివారు ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు సాగించే మహిళలు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల కోసం ఎక్కువసేపు వేచి చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగాలు, ఇతర పనుల కోసం వెళ్లే మహిళలు, విద్యార్థినులు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. బస్సు వచ్చినా అందులో ఇప్పటికే ప్రయాణికులు అధికంగా ఉండటంతో ఎక్కేందుకు అవకాశం ఉండటం లేదని కొందరు చెబుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో బస్టాప్‌లో నిలబడిన ప్రయాణికులను ఎక్కించకుండానే బస్సులు వెళ్లిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

## ‘బస్సుల సంఖ్య పెంచాలి’

ఉచిత ప్రయాణ పథకం కారణంగా మహిళల రాకపోకలు పెరిగిన నేపథ్యంలో సంబంధిత రూట్లలో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రత్యేక సర్వీసులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బస్టాప్‌ల వద్ద బస్సులు తప్పనిసరిగా ఆపేలా డ్రైవర్లకు, సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రయాణికుల రద్దీని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన రూట్లలో సర్వీసుల సంఖ్యను పునఃసమీక్షించాలని అంటున్నారు.

## కార్డు విషయంలోనూ గందరగోళం?

మరోవైపు ఉచిత ప్రయాణానికి సంబంధించిన గుర్తింపు కార్డు, ఆధార్ తదితర అంశాల విషయంలో కొందరు మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కొన్ని బస్సుల్లో తమ కార్డు చెల్లదని కండక్టర్లు చెప్పి టికెట్ తీసుకోవాలని కోరుతున్నారని కొందరు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అయితే ఉచిత ప్రయాణానికి వర్తించే నిబంధనలు, ఏయే గుర్తింపు పత్రాలు ఆమోదయోగ్యమనే విషయంపై ప్రయాణికులకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. ఈ విషయంలో రవాణా సంస్థ అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

ఇబ్రహీంపట్నం ప్రాంతంలో బస్సుల రద్దీ, సర్వీసుల లభ్యత, బస్టాప్‌ల వద్ద బస్సులు ఆగకపోవడం వంటి అంశాలపై రవాణా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్థానిక మహిళలు కోరుతున్నారు. ఉచిత ప్రయాణ పథకం ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనం రద్దీ, సర్వీసుల కొరత వంటి సమస్యల వల్ల దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైన చోట అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి, రద్దీ సమయాల్లో పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు.

# రూ.3 కోట్ల కోసం నాంపల్లి కోర్టు మెట్లెక్కిన ఐబొమ్మ రవి

**- ఖాతాలు ఫ్రీజ్.. కుటుంబ పోషణ కష్టంగా మారిందంటూ పిటిషన్**

**- పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యావసరాలకు ఇబ్బందులంటూ కోర్టుకు విన్నపం**






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సినీ పైరసీ కేసులో అరెస్టై ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఐబొమ్మ రవి అలియాస్ ఇమ్మడి రవి మరోసారి వార్తల్లోకి వచ్చాడు. తనకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను పోలీసులు ఫ్రీజ్ చేయడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానంటూ ఆయన నాంపల్లి 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించాడు.
తన ఖాతాల్లో సుమారు రూ.3 కోట్లు ఫ్రీజ్ అయి ఉన్నాయని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని రవి పిటిషన్‌లో కోరినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.
ఖాతాలు స్తంభించిపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం, రోజువారీ అవసరాలు, వైద్య ఖర్చులు వంటి వాటిని భరించడం కూడా కష్టంగా మారిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

## పిల్లల ఫీజుల నుంచి కుటుంబ ఖర్చుల వరకు..

బ్యాంకు ఖాతాలు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడటంతో కుటుంబ అవసరాలు, పిల్లల చదువుకు సంబంధించిన ఖర్చులు, నిత్యావసరాలు కూడా ఇబ్బందిగా మారాయని రవి తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు తెలిపాయి. కనీసం కొన్ని ఖాతాలనైనా అన్‌ఫ్రీజ్ చేసి కుటుంబ అవసరాలకు డబ్బు వినియోగించుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరినట్లు సమాచారం.

## దర్యాప్తులో భాగంగానే ఖాతాల ఫ్రీజ్..

ఐబొమ్మకు సంబంధించిన పైరసీ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు రవికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆస్తులకు సంబంధించిన డిపాజిట్లను స్తంభింపజేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఇదే నేపథ్యంలో ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ రవి కోర్టును ఆశ్రయించాడు.

## కోర్టు నిర్ణయంపైనే ఉత్కంఠ

రూ.3 కోట్లను విడుదల చేయాలన్న రవి విజ్ఞప్తిపై నాంపల్లి 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణకు వచ్చింది. అయితే ఖాతాల్లోని మొత్తాన్ని పూర్తిగా విడుదల చేస్తారా, కొంత మొత్తానికి మాత్రమే అనుమతి ఇస్తారా, లేక దర్యాప్తు పూర్తయ్యే వరకు ఫ్రీజ్ కొనసాగుతుందా అన్నది కోర్టు ఆదేశాలపై ఆధారపడి ఉంటుంది. రూ.3 కోట్ల ఫ్రీజ్.. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు.. కోర్టు మెట్లెక్కిన రవి - ఇప్పుడు న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# 25 ఏళ్లుగా ఒకే చోట..
# జూనియర్ అసిస్టెంట్‌దే పెత్తనమా.?

**దేవాదాయ శాఖలో ఏం జరుగుతోంది, ఉన్నత అధికారులు పట్టించుకోరా.?**

**“ఆయన చెప్పిందే వేదం”.. ప్రశ్నిస్తే. సమాచారం “ఇవ్వను.. తెలుసు” అంటూ సమాధానం.?**







పాపన్నపేట(ప్రశ్న న్యూస్) ఏడుపాయల వనదుర్గాభవాని దేవస్థానంలో హుండీ లెక్కింపు సందర్భంగా అధికారుల వ్యవహారశైలిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అచ్చునపల్లి శ్రీనివాస్ సుమారు 25 సంవత్సరాలుగా అదే దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఇంత సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న నేపథ్యంలో ఆయనకు అక్కడ విశేష ప్రాధాన్యం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్ని సంవత్సరాలుగా ఒకే స్థానంలో విధులు నిర్వహించడం దేవాదాయ శాఖ నిబంధనలకు పూర్తి విరుద్ధం అయిన ఉన్నత అధికారులు ట్రాన్స్ఫర్ చేయకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. హుండీ లెక్కింపు సందర్భంగా మీడియా ప్రతినిధులు వివరాలు కోరినప్పుడు, “ఆఫీసు వద్ద వాయిస్ ఇస్తాను” అంటూ ఈవో అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చకు దారితీసింది. ఇదే సమయంలో హుండీ లెక్కింపునకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించినప్పుడు “ఇవ్వను.. నాకు తెలుసు” అంటూ సమాధానం ఇచ్చినట్లు మీడియా ప్రతినిధులు చెబుతున్నారు. ఈవో సైతం హుండీ లెక్కింపు పై పూర్తి సమాచారం ఇవ్వకపోవడం వెనుక ఏమైనా గోల్మాల్ జరిగిందా అన్న అనుమానాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు.

## అధికారుల కంటే సిబ్బంది మాటే చెల్లుతుందా.?

దేవస్థానంలో కీలకమైన హుండీ లెక్కింపులు, ఆదాయ వివరాలు వంటి అంశాల్లో అధికారిక సమాచారాన్ని మీడియాకు ఎవరు అందించాలి.? ఏ విధానంలో అందించాలి.? అన్నదానిపై స్పష్టత అవసరమని జర్నలిస్టులు పేర్కొన్నారు.ఒక ఉద్యోగి చెప్పిందే తుది నిర్ణయంగా మారుతోందా.? అధికారులపై సిబ్బంది ప్రభావం చూపుతున్నారన్న ఆరోపణల్లో వాస్తవమెంత? ఈవో సైతం కిందిస్థాయి ఉద్యోగులు చెప్పిన దానికే సై అనడం విచిత్రంగా మారిందని, అసలు ఈవో సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా లేకుంటే ఉద్యోగులకు అన్ని అప్ప చెప్పి ఏసీ గదిలో సేద తీర్చుకుంటున్నారా అన్న ప్రశ్నలు భక్తుల నుండి తలెత్తుతున్నాయి. సుదీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల విషయంలో శాఖాపరమైన మార్గదర్శకాలు పాటిస్తున్నారా.? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

## ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

భక్తుల కానుకలతో ముడిపడిన హుండీ ఆదాయంలో పూర్తి పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉంది. మీడియాకు సమాచారం ఇవ్వడంపై దేవస్థానంలో ఏదైనా అధికారిక విధానం ఉంటే దాన్ని బహిర్గతం చేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు. 25 ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ పాత్రపై వస్తున్న ఆరోపణలు ఏమిటి.? హుండీ లెక్కింపులో సమాచారాన్ని వెల్లడించడంపై ఎవరి నిర్ణయం అమలవుతోంది.? అనే అంశాలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని భక్తుడు కోరుతున్నారు. ఒకే చోట సంవత్సరాలుగా ఉన్న ఉద్యోగులను వెంటనే ట్రాన్స్ఫర్ చేయాలని లేని పక్షంలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని భక్తులు పేర్కొన్నారు.

# చేబ్రోలు సీతారాముడి సన్నిధిలో పవన్ కల్యాణ్

**- ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ప్రత్యేక పూజలు**

**- ఆలయ అభివృద్ధికి ఇప్పటికే రూ.90 లక్షల నిధులు**

**- పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శ్రీకారం**



చేబ్రోలు(ప్రశ్న న్యూస్) ఏకాదశి వ్రతాచరణలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఉదయం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రాతఃకాల సేవలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి ఆలయానికి చేరుకున్న సందర్భంగా అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో స్వామివారి సేవలో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి ఆలయం సమీపంలో పవన్ కల్యాణ్ సభ నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రెండు విడతల్లో దాదాపు రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఆలయంలో కాలక్షేప మండపం, రథశాల, అన్నదాన హాలు, యాగశాల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీ సీతారామస్వామి దర్శనం అనంతరం పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఏకాదశి పర్వదినాన సీతారామస్వామి దర్శనం చేసుకోవడం ప్రత్యేకత సంతరించుకుంది.

# వర్షానికే బురదమయంగా మారిన రోడ్డు

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసుల డిమాండ్**





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు రాజేష్ కుమార్ ఆర్థోపెడిక్ ఆసుపత్రి సమీపంలోని రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన స్వల్ప వర్షానికే రహదారి మొత్తం బురదమయంగా మారడంతో కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై భారీగా బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వృద్ధులు, చిన్నారులు ఈ రహదారి గుండా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దుస్థితిపై స్థానిక కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకముందే అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

# శ్రీవారి రథం.. భక్తజన ప్రవాహం

**గోవిందనామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు**

**రథాన్ని లాగిన వేలాది భక్తులు..**

**కనువిందు చేసిన శ్రీమలయప్పస్వామి**



తిరుమల(ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సాగిన రథోత్సవంలో వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. రథాన్ని భక్తులు ఉత్సాహంగా లాగుతుండగా నాలుగు మాడ వీధులు ‘గోవిందా.. గోవిందా’ నామస్మరణతో మార్మోగాయి. రథంపై విహరిస్తున్న శ్రీమలయప్పస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అడుగడుగునా బారులు తీరారు. రథం ముందుకు సాగుతున్న కొద్దీ భక్తులు హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. తాళ్లను పట్టుకుని రథాన్ని లాగుతూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. స్వామివారి కటాక్షం పొందిన అనుభూతితో భక్తులు పరవశించారు.

## ఆర్ష సంప్రదాయంలో ప్రత్యేక స్థానం

హిందూ ఆర్ష సంప్రదాయంలో రథోత్సవానికి విశిష్ట స్థానం ఉంది. అనాదికాలం నుంచి రాజులు రథాలపై సంచరించినట్లు ఇతిహాసాలు, పురాణాలు పేర్కొంటున్నాయి. యుద్ధాల్లోనూ రథాలను విస్తృతంగా వినియోగించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడని ఆర్ష గ్రంథాలు వివరిస్తాయి. ప్రసిద్ధ ఆలయాల్లో ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి ఊరేగించే సంప్రదాయం ఆగమశాస్త్ర సమ్మతంగా కొనసాగుతోంది.‘రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే’ అనే ఆర్షవాక్యం రథంపై కొలువుదీరిన శ్రీకేశవుని దర్శనానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. తిరుమల శ్రీవారి రథోత్సవం ఈ విశిష్ట సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది.

## రథానికి తాళ్లు.. భక్తికి బంధం

స్వామివారి రథానికి కట్టిన తాళ్లను పట్టుకుని వేలాది మంది భక్తులు రథాన్ని ముందుకు లాగారు. రథం కదులుతున్న ప్రతి క్షణం భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. రథోత్సవం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా భద్రతా సిబ్బంది, ఇంజినీరింగ్ తదితర విభాగాలు సమన్వయంతో సేవలందించాయి.రథోత్సవంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ. శరత్, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588